# కోడళ్లరాజ్యం !

శ్రీనివాసరావు ఇంటిపక్కనే ఇల్లు రామారావుది. ఇద్దరూ సీనియర్ సిటిజన్లే! వారిద్దరిదీ పాతికేళ్ల స్నేహం! ఎక్కడికి వెళ్లాలన్నా ఇద్దరూ కలిసే వెడతారు.

తప్పనిసరిగా సాయంత్రం అయిదు గంటలు కాగానే పార్కుకు వెళ్లి పచ్చని లాన్‌లో కూర్చునిఏదో లోకాభిరామాయణం ముచ్చటించుకుని... కాసిని బఠానీలో....వేయించిన వేరుశెనక్కాయలో కొనుక్కుని తింటారు. మనసు పడినప్పుడు ఐస్‌క్రీమ్ చీకుతూ చిన్నతనాన్ని నెమరేసుకుంటూ ఇల్లు చేరుకుంటారు.

వారిద్దరూ ఎప్పుడూ వారింటి ఎదురుగా వుంటున్న పండిత శివరామశాస్త్రి గురించే బాధపడతూంటారు.

'శాస్త్రి గారు బాగా పెద్దవాడైపోయాడు. ఆయన పన్లు ఆయన చేసుకోవటానికే ఇబ్బంది పడుతున్నాడు. కొడుకులుండి ఏం ప్రయోజనం? ఎక్కడో విదేశాల్లో తలోక మూలన వున్నారాయె? 'పార్క్ లో వున్న సిమెంటు బెంచీమీద కూర్చుంటూ అన్నాడు శ్రీనివాసరావు.

'నీకో విషయం చెప్పనా?... వెనకటి రోజుల్లో అత్తగారంటే పెద్ద పులితో సమానం! కోడళ్లకు టెర్రర్! ఇంటి పెత్తనమంతా చెలాయిస్తూ...ఇంటిల్లిపాదినీ ఒకే తాటిపైన నడిపించేది. ఆ రోజులే పోయాయి. ఇప్పుడు జాయింట్ ఫామిలీలు ఎక్కడ ఏడ్చినయ్? చెప్పినిట్టూర్చాడు రామారావు.

'అవునుమరి! మామగారంటే మత్తగజం! ఆయన మాటకి ఎవరూ ఎదురు చెప్పగలధైర్యం వుండేది కాదు. డిక్టేటర్ లాగ వ్యవహరించేవాడు. ఇంటికి పెద్ద ఆయనే. - హు! రోజులు మారినయ్. దేశానికి పరాయి పాలన పోయి స్వాతంత్ర్యం వచ్చినట్టు అత్తల స్థానాన్ని కోడళ్లు ఆక్రమించేశారు. అవిభక్త కుటుంబాల కంచుకోట బద్దలైంది. ఉద్యోగాల పేరిట రెక్కలొచ్చి మగ పిల్లలు ఎగిరి పోవటం మొదలైంది. కన్నవాళ్లు దిక్కులేని వారు కావటం... అనురాగాలు... అప్యాయాలు చిక్కి శల్యమౌటం చూస్తున్నాం'. శ్రీనివాసరావు వాస్తవాన్ని బైట పెట్టాడు.

'అవును మరి! విడి సంసారాల్లో సర్వాధికారాలు కోడళ్లవైనయ్. అత్తమామలంటే గౌరవం మర్యాద ఎక్కడ వుండేడ్చింది? వంటరి కాపురాల్లో కోడళ్లు... స్వేచ్ఛా వాయువులను పీల్చటానికి అలవాటు పడి...చుట్టం చూపుగ ఎప్పుడైనా వచ్చే ముసలి వారిని లక్ష్య పెట్టటం కరువైంది.

మగ వెధవలూ అలాగే ఏడ్చారు. భార్య అడుగులకు మడుగులొత్తుతూ వారి వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారు. 'తానుచూస్తున్న సొసైటీలో జరిగే సంఘటనలు ఏకరువుపెట్టాడు.

'తన భర్త తన పిల్లలు అనే మాటేగానీ సుఖసంతోషాలను అత్తమామలకు పంచుదామనే జ్ఞానమే లేదు కోడళ్ళకు. ఏమైనా పెద్దవాళ్ల ఇమేజ్ పడిపోయింది. ముసలి వారి ముఖాల్లో కళతప్పి ప్రేతకళ పడుతున్నది. ఓడలు బండ్లు...బండ్లు ఓడలంటే ఇదే మరి...'

'అవునోయ్! కోడళ్లకి కొమ్ములొచ్చాయ్! పెద్దతరం వారి ప్రాముఖ్యత తగ్గింది. మమతల వంతెనలు కూలిపోతున్నాయ్. స్వార్థం పీఠం వేసుక్కూర్చుంది. అత్తలు నోరెత్తితే మాటల తూటాలతో షూట్ చేస్తున్నారు కోడళ్లు! ఈ పరిణామాన్ని మార్చటం ఎవరి తరమూ కాదు. ఇలాంటి విషయాల గురించి చర్చించు కోవటం కేవలం కంఠశోష!...

అప్పటికి చీకటి పడి ఎనిమిది కావటంతో ఇద్దరూ లేచి ఇంటి దారి పట్టారు.

★★★★★

నలభైయేళ్ల క్రితమే చికాగోలో స్థిరపడిన నేను... భార్య పిల్లలను వారి ఇష్టానికి అక్కడే వదిలి... నేను మాత్రం ఇండియాకి తిరిగి వచ్చేశాను.

స్వదేశంలో అడుగు పెట్టగానే... నాసికా పుటాలకు తగిలిన ఆత్మీయసువాసనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసినయ్. ఆప్యాయతానురాగాలకు రెక్కలొచ్చినట్టు కన్పించింది.

ఇక్కడి ఆచార వ్యవహారాలు... సాంప్రదాయాల తీరేవేరు! భారతావనిలో పీల్చేగాలి మత్తుగా గమ్మత్తుగా వుంటుంది.

ఫ్లైట్ దిగి... రైలెక్కి...అక్కడి నుండి టాక్సీలో అంకుల్‌గారివూరు చేరుకున్నాను.

ఇటు సిటీ... అటు పల్లెకాని వూరిది!

బాబాయ్‌కి నలుగురు మగ... ఇద్దరు ఆడపిల్లలు! ఆ రోజుల్లో కు..ని. పద్ధతి లేదు. కనుకనే పెద్దసంసారమైంది.

అంకుల్ వేదం చదివిన పండితుడు. ఆ వూరిలోనే సంస్కృత పాఠశాలలో టీచర్‌గా చేరి హెడ్మాస్టర్‌గా రిటైర్ అయినాడు. పాతిక ఎకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం...ఇంట్లో పాడి వసతి వుండటంతో ఏనాడు దేనికీ ఇబ్బంది పడలేదు.

పండిత శివరామశాస్త్రి గారంటే...వూరు వూరంతా చేతులెత్తి నమస్కరిస్తుంది. సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యుడు కాబట్టి ఆయనంటే ఎనలేని గౌరవం. సత్కారాలు సన్మానాలకేం కొదువలేదు.

నలుగురు పిల్లలూ చదువులో మెరికలు!

కాలానుగుణంగా పిల్లలకు ఇంగ్లీషు చదువులే చెప్పించాడు. ఆడపిల్లలిద్దరికి వివాహం చేసి అత్తవారిళ్లకు పంపించాడు. ఒక అల్లుడు ఆస్ట్రేలియాలో డాక్టర్...రెండవ అల్లుడు కెనడాలో ఇంజనీరు. ఇద్దరాడపిల్లల. వివాహాల కోసం సగం పొలం అమ్మేశాడు అంకుల్. మిగతా సగం నలుగురు మగ పిల్లలకు తాను బ్రతికి వుండగానే సర్వహక్కులతో రాసి ఇచ్చి కేవలం తాను వుండే మండువా లోగిలి ఇంటిని మాత్రం వుంచుకున్నాడు.

నా చిన్న తనంలో శలవులొస్తే చాలు అంకుల్ వాళ్ల వూరికి పరుగెత్తేవాడిని. బాబాయ్ పిన్ని నన్ను ఎంతో ప్రేమగా అప్యాయంగా చూచుకునేవారు.

నేను చదువులో పైకొచ్చి ర్యాంక్‌లు తెచ్చుకుంటూంటే...తన పిల్లలూ నాకు మల్లే చదువుకోవాలని చెప్తూవుండటం నాకు ఇప్పటికీ గుర్తుంది.

నా ఆలోచనలకి బ్రేక్ వేసినట్టు టాక్సీవచ్చి అంకుల్ ఇంటి ముందు ఆగింది!

లగేజీతో టాక్సీ దిగిన నేను ఒక్క క్షణం నిలబడి అంకుల్ ఇంటివేపు చూశాను.

ఇంటికి అలనాటి వైభవం లేదు సరికదా... బెత్తికలూడిన గోడలు... కొంత భాగం పక్కకు వొరిగిన పెంకుటిపంచ... విరిగిన ప్రహారీగేటు... చువ్వలూడిన కిటికీలు..అదొక భూత్‌బంగళాలా అన్పించటంతో నా మనసు చెప్పలేని బాధకు గురైంది.

బిక్కుబిక్కుమంటూ లగేజీతో తలపు వద్ద నిలచి తోశాను. లోపల గడియపెట్టి లేక పోవటంతో తలుపు రెక్కలు బార్లగ తెరుచుకున్నయ్.

లగేజీ ఓ పక్కగా పెట్టి 'అంకుల్ అంకుల్' అంటూ కేకేశాను.

నా పిలుపుకి ఎలాంటి రెస్పాన్స్ లేక పోవటం గమనించి...సన్నగ మూలుగు విన్పిస్తున్న గదివేపు నడిచాను.

గదిలో వెలుతురు తక్కువగా వుంది. మంచంమీదపడివున్న పూచిక పుల్ల లాంటి ఆకారాన్ని చూచి అంకుల్‌ని పోల్చుకున్నాను. ఒకప్పుడు బాబాయ్ దృఢంగా రుబ్బురాయిలాగా వుండటమే నాకు తెలుసు. ఇప్పుడేమిటి మనిషి చిక్కిపూచికపుల్లలా వున్నాడు? నాకెందుకో బాబాయి స్థితి చూచి భయమేసింది.

మంచానికి దగ్గరయ్యాను.

సోడాబుడ్డికళ్లద్దాల్లోంచి మెడపైకెత్తి తదేకంగా నా ముఖంలోకి చూస్తూ 'ఎవరు?... ఎవరదీ?...' హీనస్వరంతో గొణిగాడు.

'నేను బాబాయ్..! శ్రీధరాన్ని... నువ్వేమిటి ఇలా వున్నావ్?.... ఆరోగ్యం బాగలేదా?..'

నాకళ్లు.. చెమర్చాయి.

'ఓరీ!.. నువ్వా శ్రీధరం.. నాకే మాయరోగమూ లేదు.. వృద్ధాప్య దశ నన్నిలా చేసింది.. అంతే... ఓసేవ్... ఏమేవ్.. అబ్బాయి శ్రీధరం వచ్చాడు...' అని స్వరంపెంచి అరిచాడు.

'నువ్వు హైరానా పడకు బాబాయ్'

'అదెక్కడో దొడ్లో వుండి వుంటుంది. దానికి బ్రహ్మచెవుడు-నాకు కన్పించదు.... దానికి విన్పించదు. అవునూ వొక్కడివే వచ్చావా; పిల్లలేరి? నీ భార్య క్షేమమేకదా?'.... మంచంపట్టిమీద కూర్చున్న నా వీపు నిమురుతూ అడిగాడు.

'పెళ్లాం పిల్లలు అమెరికాలోనే వుంటామన్నారు. వాళ్లని వదిలేసి నేనొక్కడినే వచ్చాను! నువ్ పడుకో... నేను దొడ్లోకివెళ్లి పిన్నితో మాటాడుతాను...'

దొడ్లో వున్న బాదం చెట్టు ఆకులతో విస్తళ్లు కుడుతూ వంటింట్లో అవుపించింది పిన్ని.

పిన్ని చాలా మంచిది ! వఠి బోళా మనిషి!

ఎగాదిగా చూచాక పిన్ని నన్ను గుర్తించటం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

'ఏరోయ్ శ్రీధరం... ఇదేనారావటం? అంతా క్షేమమేనా?- ఎన్నేళ్లైంది రా నిన్ను చూచి? పోయేలోపు నిన్ను ఈ కళ్లతో చూస్తాననుకోలేదు.'

ముసలి వారి పని అయిపోయిందన్పించినా ఎవరి పన్లు వారుచేసుకోవటం చూస్తూ ఆశ్చర్య పోవటం నావంతైంది. అప్పటి రోజుల్లో... ఆ తిండి... ఆ బలమే వేరు.. ఇప్పుడన్నీ సూపర్ హైటెక్ తిళ్లు....

'దొడ్లోకెళ్లి స్నానం చేసి రారా అబ్బీ! వంటైంది. నీకు మీ బాబాయికీ వడ్డిస్తాను. శక్తి సన్నగిల్లటంతో ఎప్పుడూ ఆ గదిలో మంచం మీద పడుకుని వుంటారాయన...!

'ఈ వయసులో... ఓపిక లేక పోయినా... ఇన్ని కష్టాలెందుకు పడటం?... హాయిగా పిల్లల దగ్గర వుండక పోయారా?..' అన్నాను.

'అద్దాలలో బిడ్డలుగాని గడ్డాలొచ్చాక బిడ్డలాని? ఇప్పుడు మేం వాళ్లకు అక్కర్లేదు. మగ పిల్లలను కని పెంచి పెద్ద చేసి చదువులు నేర్పించామే గానీ... పెళ్లాలొచ్చేక... వాళ్ల చేతుల్లో వీళ్లు కీలు బొమ్మలైనారు. పెళ్లాం ఆడమన్నట్టల్లా ఆడుతున్నారు. వాళ్లను ఎదిరించే ధైర్యమేది వెధవలకు? మా కష్టాలు ఒక్క రోజులో తీరేవి కావు.. నువ్వెళ్లి స్నానం చేసిరా! పో...!

తమ బాధనంతా క్లుప్తంగా నాలుగు మాటల్లో చెప్పటం విని నా కడుపు తరుక్కు పోయింది.

★★★★★

ఉయ్యాల బల్ల మీద కూర్చున్న అంకుల్ 'కోడళ్లా వాళ్లు?' కారురా...కొరివిదయ్యాలు! తల్చుకుంటే కడుపు భగ్గు మంటుంది. వాళ్లని ఎప్పుడో మర్చిపోయాం! నువ్వొచ్చి గుర్తుచేశావ్‌రా శ్రీధరం..' వూపిరి బిగబట్టి బాధనంతా వెళ్లగక్కేడు.

'లంకనపుట్టిన వారంతా రాక్షసులే అన్నట్టు... నలుగురు కోడళ్లదీ ఒకేమాట! ఒకే నిర్ణయం! మేం వాళ్ల దగ్గర వుండకూడదు. మాకు వాళ్లు సేవ చేయకూడదు. అంతే!' బావురు మంది పిన్ని.

'రోగం రోష్ఠ లేదు కాబట్టి. ఈ కట్టెలు ఇలా జీవించి వున్నయ్. లేకుంటే మాది అనాథ చావే అయ్యేదిరా... ఎందుకు మగ పిల్లలను కన్నామనే బాధ బాబాయ్ మాటల్లో ద్యోతకమైంది.

'ఆస్తులేనాడో పంచుకుపోయారు. మా చావు నాడైనా... తలకొరివి పెట్టటానికి కొడుకు లొస్తారనేనమ్మకం లేదు. వాళ్లొస్తామన్నా... కోడళ్లు రానీరు. ... కోడళ్లు మాయల మరాఠీలురా శ్రీధరం! కొడుకుల దేముంది? పిచ్చి సన్నాసులు... వాళ్లు కూర్చోమంటే కూర్చోవాలి... నిలుచోమంటే నిలుచోవాలి...' మాట్లాడుతూ పిన్ని అరచేతితో గుండె మీద రాసుకుంది.

'ఆవేశ పడకు పిన్నీ...నేనొచ్చాగదా! మిమ్మల్ని నేను చూచుకుంటాను..'

'కోడళ్లు మాకింత తిండి పెట్టటానికి కూడా ఏడుస్తారు. అదే మంటే వుండటానికి ఇల్లు బతకటానికి పింఛను వస్తుంది కదా అంటారు. మానవత్వం లేని రాక్షసులు కోడళ్లు... ' నెత్తి బాదుకున్నాడు బాబాయ్.

నాకు వారిద్దరి పరిస్థితీ సంపూర్ణంగా అర్థమైంది. ఈ పరిస్థితుల్లో నేను వారిద్దరికీ అన్ని విధాలా సహాయపడక తప్పదనే నిర్ణయానికొచ్చాను.

వాళ్లిద్దరినీ ఓదార్చగల శక్తి నాలో లేదనిపించింది. ఎంత గొప్పగ..దర్జాగ... బతికిన బాబాయ్ స్థితి ఎలా అయిందో కళ్లారా చూస్తుంటే నా శరీరంలో రోమాలు నిక్క బొడుచుకున్నాయ్.

ఇందుకేనా కన్నవాళ్లు కొడుకులు కావాలని కోరుకునేది? పరిస్థితి ఇంత హృదయ విదారకంగ వుంటే... వీరిని దిక్కులేని పక్షుల్లాగా కొడుకులు పట్టించుకోకుండా వదిలేయటం మానవత్వమానిపించింది.

'ఈ చరమ దశలో నువ్ అనుకోకుండా ఆపద్భాంధవుడిలా వచ్చావ్.నీ చేతుల్లో మా ప్రాణాలు పోవాలనీ ఆ దేవుడు మా ముఖాన రాసాడేమో శ్రీధరం...' పసి పిల్లలా వెక్కివెక్కి ఏడ్చింది పిన్ని.

నా హృదయం ద్రవించింది! ఎంతటి దయనీయ పరిస్థితి!

'నేను మీ కోసమే అన్నీ వదులుకుని వచ్చాను. నేను మీతోటే వుంటాను... ధైర్యం నూరిపోశాను.

వారు పడే మానసిక క్షోభ కళ్లారా చూస్తూ చేష్ఠలుడిగిన వాడిలా వుండి పోవలసి వచ్చింది.

ఒకరినొకరు పట్టుకుని... గతాన్ని తల్చుకుంటూ... తమ ప్రస్తుత పరిస్థితికి ఏడ్చి ఏడ్చి చివరికి స్పృహ తప్పి పడిపోయారు.

ఆ దృశ్యం చూచి బ్రమ్నపడ్డాను. అంత లోనే తెప్పరిల్లుకుని వారిద్దరూ జీవించి వున్నారో లేదోనే సందేహం నాలో పొడచూపటంతో వాళ్ల నాడి పరీక్షించాను. నాలో తెలీని భయం ఆవహించింది. ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాను. శ్వాస నిల్చిపోయిందనే భయంకర నిజాన్ని గ్రహించాను.

ఇందుకా నేను అమెరికా నుండి వచ్చింది? మీ ఇద్దరికీ దహన సంస్కారాలు నిర్వహించటానికా? నాలో దుఃఖం పెల్లుబుకింది.

నన్ను ప్రాణాధికంగా ప్రేమించి అభిమానించిన పిన్ని బాబాయ్ ఏక కాలంలో మృతి చెందినందుకు బాధపడినా...కన్న కొడుకులు వారిని గాలికి వదిలేసి పట్టించుకోకపోయినా... పిన్ని బాబాయ్ తల కొరివి పెట్టే అదృష్ఠం నాకు కల్గినందుకు నా అంతరాత్మ ఎంతగానో సంతోషించింది!

-:(సమాప్తం):-